క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

హన్మకొండ : వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో ఈ నెల 22న (శుక్రవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. ఆటోనగర్ సెక్షన్, కొత్తవాడ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఆయన గురువారం ఒక ప్రకటనలో వివరించారు.

కార్మికులను ఆదుకోవాలి



నయీంనగర్ : టైర్ పంచర్ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని కాకతీయ టైర్ ఫైటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.నగేష్ కోరారు. గురువారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో నగేష్ మాట్లాడుతూ.. గ్రేటర్ వరంగల్ పరిధిలో పెట్రోల్‌బంక్‌ల్లో ఉన్న పంచర్ షాపులను తొలగించాలని, బిహార్ నుంచి వచ్చిన స్థానికేతరులు పంచర్ షాపులు పెట్టకుండా చూడాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం సభ్యులు ఖలీమ్, భిక్షపతి, రాంచందర్, జుబేర్, జాఫర్, రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోచమ్మ బోనాలు



కాజీపేట అర్బన్ : న్యూశాయంపేటలో గురువారం పోచమ్మతల్లి బోనాలను వైభవంగా నిర్వహించారు. బోనాలను పోచమ్మతల్లికి సమర్పించారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య 5కిలోల 250 గ్రాములు వెండితో తయారు చేసిన పోచమ్మతల్లి అమ్మవారి వెండి తొడుగును బహూకరించి, కుటుంబ సభ్యులతో కలిసి పూజలు చేశారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కార్పొరేటర్ మామిండ్ల రాజు, అభినవ్‌భాస్కర్, కుసుమ శ్యాంసుందర్, గ్రామస్తులు పోచమ్మ తల్లికి పూజలు నిర్వహించారు.

చేయూత



హన్మకొండ కల్చరల్ : ఖిలా వరంగల్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకులంలో ఎనిమిదో తరగతి చదువుతున్న బొల్లికుంటకు చెందిన కూచన చరణ్ తండ్రి ఈ నెల13న అనారోగ్యంతో మృతిచెందాడు. చరణ్ కుటుంబ పరిస్థితి తెలుసుకొన్న ప్రిన్సిపాల్ మనోహర్ రెడ్డి, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో సేకరించిన రూ.50వేల నగదును చరణ్ పేరిట ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన బాండ్ పేపర్‌ను ప్రిన్సిపాల్ వై. మనోహర్‌రెడ్డి గురువారం చరణ్ తల్లికి అందజేశారు.

కబ్జాపై అధికారుల కన్నెర్ర



సాక్షి ఎఫెక్ట్..

హసన్‌పర్తి : భూముల కబ్జాపై అధికారులు కన్నెర్ర చేశారు. ఎస్సారెస్పీ భూములను కబ్జా చేసిన అక్రమార్కులకు వాటిని అద్దెకు ఇవ్వడంతో పాటు వాటిలో అసాంఘిక కార్యకలాపాలు సాగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇదే విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే దృష్టికి సైతం తీసుకెళ్లారు. 'కబ్జా చేశాడు.. అద్దెకు ఇచ్చాడు' అనే కథనం 'సాక్షి'లో ఇటీవల ప్రచురితం కాగా అధికారుల స్పందించారు. గురువారం కరీంనగర్–హనుమకొండ ప్రధాన రహదారిలోని చింతగట్టు క్యాంపు సమీపంలో అక్రమంగా పార్కింగ్ చేసిన ఇసుక లారీలను తొలగించడానికి అధికారులు అక్కడికి చేరుకున్నారు. డ్రైవర్లు అందుబాటులో లేరని, శుక్రవారం ఉదయం వరకు లారీలు తీసుకెళ్తామని వా రు కోరారు. అక్రమంగా నిర్మించుకున్న ప్రహరీని కూల్చివేశారు. ఎస్సారెస్పీ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని నీటిపారులశాఖ డీఈఈ రాజు తెలిపారు. ఏఈ శ్రీనివాస్, ఎస్సై రవీందర్, ఆర్ఐ ఫాజిల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అమలులో నిర్లక్ష్యం

హన్మకొండ : ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలులో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోందని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. గురువారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో దళిత బహుజన ఫ్రంట్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూమిలేని వ్యవసాయ, ఉపాధి హామీ కూలీలందరికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని అమలు చేయాలనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడిరాజుల రాములు అధ్యక్షత వర్గంగా కొనసాగిన ఈ సమావేశంలో పి.శంకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

'డబుల్' డిమాండ్!

- వ్యవసాయ భూముల రైతుల ఖాతాల్లో జమవుతున్న నగదు
- రేటు పెంచాలంటున్న వ్యవసాయేతర భూ యజమానులు
- తుది సమావేశం నిర్వహించే యోచనలో అధికారులు



సాక్షి, వరంగల్: మామునూరు విమానాశ్రయ నిర్మాణ పనులు ఈ ఏడాది ఆఖరులోగా మొదలు పెట్టాలని కేంద్రం కృతనిశ్చయంతో ఉంది. అందుకు అవసరమయ్యే భూమిని సేకరించి ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం వడివడిగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా వద్ద 696 ఎకరాల భూమి ఉంది. రన్‌వే విస్తరణకు అవసరమయ్యే 253 ఎకరాల భూమిని సేకరించేందుకు ప్రభుత్వం ఇటీవల రూ.205 కోట్లు కేటాయించింది. పరిపాలనాపరమైన అనుమతులివ్వడంతో కన్సెంట్ ఇచ్చిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమవుతున్నాయి. ఇప్పటి వరకు 48 మంది రైతుల ఖాతాల్లో రూ.34,86,05,298 జమ చేశారు. వ్యవసాయ భూములకు ఎకరానికి రూ.కోటి 20 లక్షలు చెల్లిస్తుండడంతో చాలా మంది రైతులు ఇప్పటికే కన్సెంట్ ఇచ్చారు.

రెట్టింపు కావాలని డిమాండ్

వ్యవసాయేతర భూముల (ఓపెన్ ప్లాట్లు)కు చదరపు గజానికి రూ.4,887లు ఇస్తామని వరంగల్ కలెక్టర్ సత్యశారద నేతృత్వంలోని డిస్ట్రిక్ట్ లెవెల్ ల్యాండ్ నెగోషియేషన్ కమిటీ పలుదఫాలుగా సమావేశమై నిర్ణయించింది. అందుకు రెట్టింపు కావాలంటూ చాలా మంది భూనిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో వ్యవసాయేతర భూముల యజమానులతో మరోసారి సమావేశం నిర్వహించనున్నారు. చివరిగా మరో చదరపు గజానికి రూ.500 నుంచి రూ.600ల వరకు పెంచే వీలుందనే ప్రచారం జరుగుతోంది. ఒకవేళ ఎవరైనా భూ యజమానులు పరిహారం తీసుకోకపోతే ఆ డబ్బును కోర్టులో డిపాజిట్ చేసి చట్ట ప్రకారం భూమి సేకరించాలని అధికారులు ఆలోచిస్తున్నట్లు తెలిసింది.

మరో రూ.115 కోట్లు అవసరమే..

విమానాశ్రయ నిర్మాణానికి నక్కలపల్లి, గాడిపల్లి, గుంటూరుపల్లి గ్రామాల్లో 240 ఎకరాల వ్యవసాయ భూమి, సుమారు 13 ఎకరాల (61,134.5 చదరపు గజాల) వ్యవసాయేతర భూమి సేకరించాల్సి ఉంది. సాగుకు సంబంధించిన 240 ఎకరాలకు భూపరిహారం కింద రూ.288 కోట్లు అవుతున్నాయి. 61,134.5 చదరపు గజాలకు రూ.29,87,61,858 భూనిర్వాసితులకు చెల్లించాలి. మొత్తంగా రూ.317 కోట్లు అవసరం అవుతుండడంతో మరోదఫా ప్రభుత్వం రూ.112 కోట్లు నిధులు కేటాయించాల్సిన అవసరం కనబడుతోంది. వ్యవసాయేతర భూముల రైతులకు చదరపు గజానికి మరో రూ.600లు పెంచినా రూ.ముడు నుంచి రూ.నాలుగు కోట్లు అదనంగా అవసరమవుతాయి. ఈ లెక్కన రూ.320 కోట్లకుపైగా అవసరం కానుంది.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ



కరీమాబాద్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న మంత్రి సురేఖ

ఖిలా వరంగల్ : ప్రాంతాల అభివృద్ధి, పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వ పాలన కొనసాగుతోందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. గురువారం వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు కలెక్టర్ సత్యశారద, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయి, మేయర్ గుండు సుధారాణిలతో కలిసి మంత్రి సురేఖ శంకుస్థాపన చేశారు. అనంతరం బీరన్న కుంట ప్రభుత్వ పాఠశాలలో అక్షయ పాత్ర అందజేసిన మధ్యాహ్న భోజనాన్ని మంత్రి స్వయంగా విద్యార్థులకు వడ్డించారు. ఆ తర్వాత కరీమాబాద్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో, రంగశాయిపేట కమ్యూనిటీ హాల్‌లో వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో మంత్రి సురేఖ మాట్లాడారు. విద్యార్థులకు మెరుగైన విద్య, పౌష్టికాహారం అందించే దిశగా రామకృష్ణ మిషన్ అక్షయ పాత్ర ద్వారా మొదటి విడత జిల్లాలో 123ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం కల్పిస్తున్నట్లు చెప్పారు. నగరాన్ని ముప్పు నుంచి కాపాడేందుకు అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయన్నారు. వరంగల్ జిల్లాలో అర్హత గల 6,815 నూతన రేషన్ కార్డులు, 26,766 కుటుంబ సభ్యుల పేర్లను నమోదు చేసినట్లు తెలిపారు. తూర్పులో 2,699 కొత్త కార్డులు, 7,592 మంది కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేసినట్లు వెల్లడించారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, తహసీల్దార్లు ఇక్బాల్, బండి నాగేశ్వర్‌రావు, కార్పొరేటర్లు పల్లం పద్మ, గుండు చందన, ఉర్సు దర్గా పీఠాధిపతి ఉబేద్‌బాబా, నవీద్‌బాబా, ఎండీ ముఖ్దూమ్, ఎంఏ జబ్బార్, వేణు,హెచ్ఎం మాధవి పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలతోనే సమగ్రాభివృద్ధి

- ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

ఖిలా వరంగల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, గత ప్రభుత్వ వైఫల్యాలను బూచిగా చూపి ప్రజా సమస్యలను విస్మరిస్తున్నారని, రానున్న రోజుల్లో జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రజా ఉద్యమాలే శరణ్యమని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్, నగర కార్యదర్శి మాలోత్ సాగర్ తెలిపారు. గురువారం వరంగల్ రంగశాయిపేటలో ఓ కన్వెన్షన్ హాల్‌లో తాటికాయల రత్నం అధ్యక్షతన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించగా వారు హాజరై మాట్లాడారు. నగరానికి కనీస నిధులు కేటాయించకుండా అభివృద్ధిలో వెనుకబడడానికి కారణం అవుతున్నారని విమర్శించారు. కలెక్టర్ సముదాయాన్ని త్వరగా పూర్తి చేయించాలని, నత్తనడకన సాగుతున్న బస్టాండ్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, వ్యవసాయ పారిశ్రామికరణ చేపట్టాలని, అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని వారు డిమాండ్ చేశారు. నర్ర ప్రతాప్, జగదీశ్వర్, రామస్వామి, నాగేష్, మహబూబ్ పాషా, మాలి ప్రభాకర్, గణిపాక ఓదెలు, రత్నం, ప్రత్యూష, దాసు, నర్సయ్య, మాధవి, లక్ష్మణ్, కైసర్, పూలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఒక్కపూట పనిని అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉప్పలయ్య

హసన్‌పర్తి : మున్సిపల్ కార్మికులకు ఒక్కపూట పనిని అమలు చేయాలని సీఐటీయూ మండల సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్‌అండ్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ మండల మహాసభ గురువారం ఓ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉప్పలయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కపూట పని అనేక కార్పొరేషన్‌లలో అమలు చేస్తున్నా కేవలం వరంగల్‌లో మాత్రం అమలు కావడం లేదన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేష్ పాల్గొన్నారు. నూతన కమిటీని ఎన్నుకోగా అధ్యక్షుడిగా సందెల భిక్షపతి, ఉపాధ్యక్షుడిగా పాపయ్య, లింగాల ప్రియాంక, జన్ను రజిత, గౌరవ అధ్యక్షుడిగా పుట్ట రాజు, మండల కార్యదర్శిగా బొంకూరి నాగరాజు, సహాయ కార్యదర్శులుగా గాదె కుమార్, మేకల కిశోర్, సందీప్, కోశాధికారిగా సంగాల ప్రణయ్, గౌరవ సలహాదారుడిగా కొమురయ్య, కూర సుజాతను ఎన్నుకున్నారు.

శ్రీ శరణ్య ఆస్పత్రిలో ఓపీ రాయితీ



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ ప్రశాంత, పాల్గొన్న డాక్టర్లు

హన్మకొండ : హనుమకొండ నయీంనగర్‌లోని శ్రీ శరణ్య ఆస్పత్రి వార్షికోత్సవం సందర్భంగా రాయితీ అందిస్తున్నట్లు యాజమాన్యం డాక్టర్ ప్రశాంత తెలిపారు. గురువారం ఆస్పత్రిలో 20 సంవత్సరాలు పూర్తి చేసుకుని 21వ సంవత్సరంలోకి అడుగిడిన సందర్భంగా వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానవ సేవయే మాధవ సేవగా, వృత్తినే దైవంగా భావించి వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఉత్తమ వైద్య సేవలతో రోగుల ఆదరాభిమానాలు చూరగొంటూ వైద్య సేవల్లో 20 ఏళ్లు పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి సెప్టెంబర్ 20వ తేదీ వరకు ఓపీ ఫీజులో 50 శాతం, ల్యాబ్ టెస్టులలో 30 శాతం , ఆడ్మిషన్లలో 10 శాతం రాయితీ కల్పించినట్లు వివరించారు. సాయంత్రం ఉచితంగా ఓపీ సేవలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నాగార్జున రెడ్డి, డాక్టర్ బి.వి.రెడ్డి, డాక్టర్ ఎ.రాజేందర్, ఉద్యోగి రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్‌తో మానసికోల్లాసం



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి కొండా సురేఖ

రామన్నపేట : నిత్యం వృత్తిరీత్యా ఒత్తిడికి గురయ్యే వారికి ఎగ్జిబిషన్‌తో మానసిక ఉల్లాసం కలుగుతుందని రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ నగరంలోని ఇస్లామియా కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ.. వ్యయ, ప్రయాసాలతో తీర్చిదిద్దిన స్వాగత ద్వారం విమాన సెట్టింగ్ చాలా బాగుందని నిర్వాహకులను అభినందించారు.అనంతరం ఎగ్జిబిషన్ నిర్వాహకుడు అస్లాం మాట్లాడుతూ వరంగల్ నగర ప్రజలకు వినోదం ఉల్లాసాన్ని అందించడానికి ఇతర దేశాల్లో పర్యటించిన అనుభూతి కలిగించేలా సెట్టింగ్ ఏర్పాటు చేశామని తెలిపారు. దేశ నలుమూలల నుంచి వచ్చిన వివిధ రకాల చేతి వృత్తులు, కలంకారీ, మహిళలకుఅలంకరణ వస్తువులు, గృహోపకరణాలు, పిల్లలకు బొమ్మలు, తదితర 100కు పైగా స్టాల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే ఇటాలియన్ టైప్ భారీ అమ్యూజ్‌మెంట్ పార్కులో రేంజర్, జైంట్ వీల్ తదితర అనేక ఐటమ్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఎగ్జిబిషన్ ప్రతిరోజు సాయంత్రం 5నుంచి రాత్రి 10 గంటల వరకు ఉంటుందన్నారు. నిర్వాహకులు శ్రీకాంత్, మీర్జా రఫీక్ బేగ్, మేనేజర్లు ఫిరోజ్, డేవిడ్, శ్రీపాల్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో తీజ్ వేడుకలు



తీజ్ నిమజ్జన పూజలు నిర్వహిస్తున్న గిరిజనులు



తీజ్ వేడుకలో సీతారాం నాయక్, అధ్యాపకులు

హన్మకొండ : హనుమకొండ అశోక కాలనీలోని గిరిజన భవన్‌లో, రాంనగర్ బంజారా కాలనీలో తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన తీజ్ ఉత్సవాలు గురువారం ముగిశాయి. గోర్ బంజారా తీజ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం తీజ్ నిమజ్జన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గిరిజన భవన్‌లో పూజా కార్యక్రమాలు నిర్వహించి తీజ్ బుట్టను ఊరేగింపుగా నృత్యాలతో తీసుకెళ్లారు.

కేడీసీలో..

విద్యారణ్యపురి : బంజారా సంస్కృతిని పరిరక్షించుకోవాలని మహబూబాబాద్ మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ పేర్కొన్నారు. గురువారం కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉత్సాహంగా గోర్ బంజారా తీజ్ ఉత్సవాలను అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాం నాయక్ మాట్లాడారు. సేవాలాల్ మహరాజ్ జయంతికి ప్రభుత్వం సెలవు ప్రకటించాలన్నారు. హథీరాం బాలాజీ మఠాన్ని కాపాడే విధంగా బంజారా సోదరులు ఏకమై కదిలి రావాలని కోరారు. కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ గుర్రం శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ డాక్టర్ చిన్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా తీజ్ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించి పద్మాక్షి గుట్టవద్ద చెరువులో నిమజ్జనం చేశారు.

సమస్యలు పరిష్కరించాలి

ఎంజీఎం : కాకతీయ వైద్య కళాశాల మెన్స్, ఉమెన్స్ హాస్టళ్లలో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాద నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం 10వ రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా కాకతీయ వైద్య కళాశాల ప్రధాన ద్వారం ఎదుట కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యాద నాయక్ మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుధాకర్, అల్లం రమేష్, రాణి, రాజకుమారి, ఎండీ అతిక్, రవి, బాబు, మంద కవిత తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణలతకు పీహెచ్‌డీ ప్రదానం



హన్మకొండ : హనుమకొండ స్నేహనగర్ కాలనీకి చెందిన కందుకూరి స్వర్ణలత పీహెచ్‌డీ పట్టా పొందారు. ఓయూ స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఇస్రో చైర్మన్ వి.నారాయణన్, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కుమార్ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

కాజీపేట : కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్, జామా మసీదు వీధుల్లో రూ.16లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం కార్పొరేటర్ విజయశ్రీ రజాలీ ప్రారంభించారు. నాయకులు క్రాంతిభరత్ రాజ్, ఎండీ షబ్బీర్ అలీ, బిలాల్, ఖురేసి, వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

హన్మకొండ అర్బన్ : రక్తదాతలు.. ప్రాణదాతలతో సమానమని హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ విజయచందర్‌రెడ్డి అన్నారు. గురువారం లయన్ పొన్నాల సంయుక్త పుట్టినరోజు సందర్భంగా నగరంలోని ఏషియన్ మాల్ సమీపంలోని సాయిబాబా ఆలయ ఆవరణలో తలసీమియా బాధితుల కోసం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు.

వృద్ధులను గౌరవించాలి



విద్యారణ్యపురి : వృద్ధులను గౌరవించడం మన సాంప్రదాయమని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ బెంచీ మెంబర్ డాక్టర్ అనితారెడ్డి అన్నారు. గురువారం హనుమకొండలోని లార్డు వృద్ధాశ్రమంలో జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా వృద్ధులను సన్మానించారు. ట్రిబ్యునల్ కోర్టు గురించి అవగాహన కల్పించారు. నాగరాని నరేష్, మమత పాల్గొన్నారు.

పరామర్శ

హసన్‌పర్తి : బైరాన్‌పల్లికి చెందిన బండి సారయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా బాధిత కుటుంబాన్ని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే సీతంపేటకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు ఓదెలు అనారోగ్యంతో మృతిచెందగా భౌతిక కాయాన్ని ఎర్రబెల్లి దయాకర్‌రావు సందర్శించారు.

మట్టి విగ్రహాలనే పూజించాలి

హసన్‌పర్తి : మట్టి వినాయక విగ్రహాలనే పూజించాలని సుజాత పాఠశాల ఆధ్వర్యంలో గురువారం ప్రచారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆకుతోట రాంబాబు,విద్యార్థులు ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు.

మాసశివరాత్రి పూజలు

హన్మకొండ కల్చరల్ : వేయిస్తంభాల ఆలయంలో గురువారం మాసశివరాత్రి సందర్భంగా మాసశివరాత్రి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు ప్రభాతసేవ, ఉత్తిష్టగణపతికి , శ్రీరుద్రేశ్వరునికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, నందీశ్వరుని పూజ నిర్వహించారు.

ఫొటోలు సమాజాన్ని మేల్కొలుపుతాయి



సాక్షి ఫొటో జర్నలిస్టులకు బహుమతి ప్రదానం చేస్తున్న ప్రకాశ్, క్లబ్ సభ్యులు

నయీంనగర్ : సామాజిక దృక్పథం ఉన్న ఫొటోలు సమాజాన్ని మేల్కొలుపుతాయని శాసన మండలి వైస్ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ అన్నారు. గురువారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ఆధ్వర్యంలో నిర్వహించిన ఫొటో కాంటెస్ట్ విజేతలకు బహుమతి ప్రదానంలో ప్రకాశ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉత్తమ వార్త చిత్రం విభాగంలో జీవన వైవిధ్యం క్యాప్షన్ ఫొటోకు సాక్షి దినపత్రిక వరంగల్ స్టాఫ్ ఫొటో గ్రాఫర్ పెద్దపల్లి వరప్రసాద్‌కు ప్రథమ బహుమతి రూ.10 వేలు, జనగామ సాక్షి ఫొటో గ్రాఫర్ గోవర్ధనం వేణుగోపాల్‌కు కన్సోలేషన్ బహుమతి రూ.2 వేల చెక్కును, మెమోంటో, ప్రశంసపత్రంతో సత్కరించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి అమర్, జర్నలిస్ట్ సంఘాల నాయకులు గాడిపెల్లి మధు, గడ్డం కేశవమూర్తి, వేణుమాధవ్, సంపత్, సంపెట సుధాకర్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలి

హన్మకొండ కల్చరల్ : సమయపాలన పాటిస్తూ దేవాలయాన్ని, ఆలయ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతూ భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలని జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్, శ్రీ భద్రకాళి దేవాలయం ఈఓ రామల సునీత భద్రకాళి దేవాలయం సిబ్బందిని ఆదేశించారు. గురువారం దేవాలయ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు.

విరాళాలు వసూలు చేస్తే చర్యలు తీసుకోవాలి

ఖిలా వరంగల్ : దేవాలయాల అభివృద్ధి పేరుతో విరాళాలు, చందాల రూపంలో వసూలు చేసే వ్యక్తులను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం సాయంత్రం దేవాదాయ, ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్‌కు శ్రీగోవిందరాజ స్వామి పూజారులు వినతిపత్రం అందజేశారు.

23,24 తేదీల్లో క్రీడా పోటీలు

వరంగల్ స్పోర్ట్స్ : ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 23, 24వ తేదీల్లో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వలంటీర్లు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. పురుషులకు వాలీబాల్, మహిళలకు త్రోబాల్ క్రీడాంశాలలో పోటీలు ఉంటాయని, జట్లను ఉచితంగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 89784 20042 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

బాలికల విద్యకు ప్రాధాన్యం

హసన్‌పర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం బాలికల విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళా చెప్పారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో శానిటరీ న్యాప్కిన్స్ పంపిణీ చేశారు. జోరుక పూల, కరుణశ్రీ, దువ్వ రేవతి, బత్తుల స్వాతి, సుకన్య, ఝాన్సీ, ఇంద్ర తదితరులు పాల్గొన్నారు.

కృష్ణుడి ప్రతిమకు శోభాయాత్ర

హన్మకొండ : కృష్ణాష్టమి సందర్భంగా శ్రీ కృష్ణుడి ప్రతిమకు గురువారం ఊరేగింపు నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక హనుమకొండ, జమ్మికుంట ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండలోని 100 ఫీట్ల రోడ్డు, వెంకటేశ్వర కాలనీలో శోభాయాత్ర నిర్వహించారు. కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, జాలి లీల, జగన్‌మోహన్ రెడ్డి, జాలి జ్యోతి, సందీప్ రెడ్డి స్వామివారి పల్లకి సేవలో పాల్గొన్నారు.

సీపీఎం నాయకుల సర్వే..

ఖిలా వరంగల్/మామునూరు : వరంగల్ 42వ డివిజన్ రంగశాయిపేట బెస్తవాడలో, 43వ డివిజన్ నక్కలపల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రంగశాయిపేట బెస్తవాడ, కురుమవాడ, కుమ్మరి వాడలో సీపీఎం సర్వే కొనసాగుతుంది.

శిథిల విద్యుత్ స్తంభాలు తొలగించాలి

ఖిలా వరంగల్ : ప్రమాదకర శిథిలమైన విద్యుత్ ఐరన్ స్తంభాలు, వేలాడుతున్న తీగలు, నాణ్యమైన కరెంట్ సరఫరా చేయాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్లి రవి డిమాండ్ చేశారు. గురువారం వరంగల్ 40వ డివిజన్ కరీమాబాద్ ఉర్సు ప్రతాప్‌నగర్‌లో పి.విజయ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డివిజన్లలో పురాతన ఐరన్ స్తంభాలు వర్షాలు కురుస్తే విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌కు గురయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వెలిబుచ్చారు.

ఇంటి స్థలం కేటాయించాలి

ఖిలా వరంగల్ : పేదలకు ఇంటి స్థలంతోపాటు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు నలిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. గురువారం వరంగల్ 38వ డివిజన్ పడమరకోటలో సీపీఎం ఆధ్వర్యంలో సమస్యలపై ఇంటింటి సర్వే నిర్వహించారు.

గణపతి బ్రహ్మోత్సవాలు షురూ

కాజీపేట : కాజీపేట విష్ణుపురిలోని స్వయంభు శ్వేతార్క మూలగణపతి ఆలయంలో గురువారం వినాయక చవితి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయిన వోలు వెంకటేశ్వర్లు శర్మ ఆధ్వర్యంలో ఆలయాన్ని శుద్ధి, సంప్రోక్షణం చేశారు.16 రోజుల పాటు సాగే ఉత్సవాలను కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్-రమ దంపతులు ప్రారంభించారు. శ్వేతార్కుడిని రాజగణపతిగా పట్టు వస్త్రాలతో అలంకరించారు. భక్తులందరికి అన్నపూర్ణ కేంద్రాల్లో నిత్యాన్నదానాలు ప్రారంభమయ్యాయి.

అలరించిన సంగీత, నృత్య కళార్చన

హన్మకొండ కల్చరల్ : వరంగల్‌లోని విద్యారణ్య ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాలలో గురువారం సాయంత్రం నిర్వహించిన కళార్చన సంగీత, నృత్య విద్యార్థుల సాంస్కృతికోత్సవం అలరించింది. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సుధీర్‌కుమార్ అధ్యక్షతన చేపట్టిన కార్యక్రమంలో సంగీత, నృత్య కోర్సు విద్యార్థులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి


మామునూరు : విద్యార్థులు మాదక ద్రవ్యాలకు బానిస కావొద్దని, చట్టాలపై అవగాహన ఉండాలని మామునూరు ఇన్‌స్పెక్టర్ రమేష్ సూచించారు. గురువారం బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఎస్సైలు కృష్ణవేణి, శ్రీకాంత్ ఆధ్వర్యంలో ర్యాగింగ్ చట్టాలు, మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాశ్, మురళి, ఎండీ ముస్తాక్ అహ్మద్, తిరుపతిరావు, డీస్ ఎం. శశిధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణా నేరం



హసన్‌పర్తి : మానవ అక్రమ రవాణా నేరమని మానవ అక్రమ నిరోధక విభాగం (ఏహెచ్‌టీయూ) ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్ అన్నారు. మండలంలోని భీమారంలో గల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో మానవ అక్రమ రవాణపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ఇన్‌స్పెక్టర్ శ్యాంసుందర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎస్ఓ స్వప్న, సబ్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్, ఏఎస్సై భాగ్యలక్ష్మి, పీసీ రామారావు, మోహసిన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి సారంగపాణి



పుస్తకాలు ఆవిష్కరిస్తున్న అంపశయ్య నవీన్

హన్మకొండ : బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ పరికిపండ్ల సారంగపాణి అని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ అన్నారు. గురువారం హనుమకొండ ఎన్జీఓస్ కాలనీలోని స్వగృహంలో పరికిపండ్ల సారంగపాణి సంవత్సరీకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రచించిన పుస్తకాలను అంపశయ్య నవీన్ ఆవిష్కరించారు. మహబూబాబాద్ జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ మాట్లాడుతూ సారంగపాణి సైకాలజిస్ట్‌గా ఉచితసేవలు అందించారని గుర్తు చేశారు. పరికిపండ్ల వేణు, తాళ్ల విజయ్, మండల శేఖరయ్య, తుమ్మ సాంబయ్య, బొల్లు రాజేష్, పరికిపండ్ల భరత్, గాజుల సంపత్, కవిత, సౌభాగ్య, సుజాత, సువర్ణ, కుటుంబ సభ్యులు పరికిపండ్ల సుదర్శన్,హరినాథ్, సంపత్, శ్రీధర్ పాల్గొన్నారు.